క్లుప్తంగా

ఆటల పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని సరస్వతీ శిశు మందిరం విద్యార్థులు జిల్లా స్థాయి ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచారు. పామిడిలో జరిగిన పోటీల్లో 400 మీటర్ల పరుగు పందెంలో రాయదుర్గం విద్యార్థులు అపూర్వ సాయి, 200, 400 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు పాఠశాల కమిటీ అధ్యక్షుడు పొరాళ్ల ధనార్జున, హెచ్ఎం రాజేశ్వరి తెలిపారు. విద్యార్థులు రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. విజేతలను సోమవారం పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు సర్టిఫికెట్లు



క్యాడెట్లతో ప్రిన్సిపాల్, ఎన్‌సీసీ అధికారులు

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన 13 మంది ఎన్‌సీసీ క్యాడెట్లకు సోమవారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదినారాయణ, ఎన్‌సీసీ అధికారి ప్రశాంత్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో 6వ ఆంధ్ర బెటాలియన్ నిర్వహించిన పరీక్షలో వీరు ప్రతిభ చూపారు. క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచే ఎన్‌సీసీ ద్వారా దేశభక్తి కూడా అలవాటవుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

'మట్టి తవ్వి నీరు ముందుకు వెళ్లకుండా చేశారు'

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్‌లో మల్లికేతి రోడ్డులో సీసీ రోడ్డు పక్కన మట్టి తవ్వి నీరు ముందుకు వెళ్లకుండా వేస్తున్నారని మాజీ ఎంపీటీసీ సభ్యురాలు ఇందిరమ్మ ఆరోపించారు. సోమవారం కాలనీలో ఓ వ్యక్తి సీసీ రోడ్డు పక్కన మట్టి తవ్వి సెప్టిక్ ట్యాంక్ నుంచి పంపింగ్ చేస్తూ ఇక్కడ నివాసం ఉండే వారందరికీ ఇబ్బందులు కలిగిస్తున్నారన్నారు. అధికారులకు తెలిపినా పట్టించుకోలేదన్నారు.

ఎరువుల ధరలు నియంత్రించాలి

డి హీరేహాళ్(రాయదుర్గం): కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ఎరువుల ధరలు ఇబ్బడి ముబ్బడిగా పెంచడంతో పాటు రైతుకు సరిపడా సరఫరా చేయడంలేదని ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున విమర్శించారు. సోమవారం ఆయన డి హీరేహాళ్‌లో మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే యూరియా కొరత తీర్చాలని డిమాండ్ చేశారు. సొసైటీలు, డీసీఎంఎస్‌లకు అరకొరగా కేటాయింపులు చేసి, 70 నుంచి 80 శాతం ప్రైవేట్ వ్యాపారులకు ఎరువులు ఇవ్వడం సరికాదని ఆయన అన్నారు. ప్రైవేటు డీలర్లు అధిక ధరలకు విక్రయిస్తూ రైతుల నడ్డీ విరుస్తున్నారని ధ్వజమెత్తారు. యూరియా, డీఏపీ, 28:28:0 ఎరువులు మినహా మిగతా వాటి ధరలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. సగటున బస్తాకు రూ.50 నుంచి రూ.350 వరకు పెంచేశారన్నారు. 10:26:26 కాంప్లెక్స్ 50 కిలోల బస్తా రూ.1,470 ఉంటే రూ.1,800 లకు పెరిగిందన్నారు. పొటాస్ 50 కిలోల బస్తా రూ.1,550 ఉంటే రూ.1,800లకు పెంచేశారన్నారు.

'దుర్గం'లో కోతుల బెడద



వీధుల్లో సంచరిస్తున్న కోతులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని అనేక కాలనీల్లో కోతుల బెడద తీవ్రమైంది. గుంపులుగా వస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇళ్లలోకి వచ్చి ఆహారం, వస్తువులు ఎత్తుకెళ్తున్నాయని చెప్తున్నారు. తరిమేందుకు ప్రయత్నిస్తే దాడి చేసేందుకు చూస్తున్నాయన్నారు. పట్టణంలోని చాలా చోట్ల కోతుల సమస్య ఉందని వాపోతున్నారు. కోతులను నియంత్రించేందుకు మున్సిపల్ అధికారులు తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

బీటీపీకి పోటెత్తిన వరద



బీటీపీకి చేరుతున్న వరద నీరు

గుమ్మఘట్ట: నియోజకవర్గంలోని బీటీపీకి వరదనీరు సోమవారం పోటెత్తింది. బీటీపీ నీటి నిల్వ సామర్థ్యం 1,655 అడుగులు కాగా, ప్రస్తుతం 1,650 అడుగులకు చేరుకున్నట్లు జలవనరుల శాఖ ఏఈ హరీష్ తెలిపారు. కర్ణాటక నుంచి ఇన్‌ఫ్లో 3125 క్యూసెక్కుల వరద నీరు చేరుతున్నట్లు ఆయన తెలిపారు. ఇన్‌ఫ్లో కొనసాగితే మరో వారం రోజుల్లో డ్యాం నిండే పరిస్థితి ఉందన్నారు. బీటీపీకి వరదనీరు చేరుతుండడంతో సందర్శకుల తాకిడి అధికమైంది.

భారీ వర్షాలకు కూలిన ఇల్లు

బెళుగుప్ప: మండలంలోని యలగలవంకలో వేదమూర్తి, చిక్కమ్మ దంపతుల ఇంటి గోడలు సోమవారం కురిసిన భారీ వర్షానికి కూలిపోయాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.



ఉద్దేహాళ్-బండూరు గ్రామానికి వెళ్లే దారి ఇలా ..



మల్లిపల్లిలో బురదమయంగా ఉన్న దారిని చూపుతున్న స్థానికులు



ఉద్దేహాళ్‌లో నిలిచిన వర్షపు నీరు

వీధులన్నీ బురదమయం

- చినుకుపడిందా.. చిత్తడే
- వీధుల్లో ఎటుచూసినా అపరిశుభ్రత
- నడవడానికి కూడా వీలుకాని పరిస్థితి
- పారిశుధ్య లోపంతో ప్రజల అవస్థలు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్



రాయదుర్గం టౌన్: గ్యాస్ గోడౌన్ నుంచి ముత్తరాసి కాలనీకి వెళ్లే దారిలో ఇలా..



బ్రహ్మసముద్రం మండలం పడమటి కోడిపల్లిలో రోజుల తరబడి రోడ్డుపైనే నిలిచిన వర్షపు నీరు



గుమ్మఘట్ట మండలం కలుగోడులో పారుతున్న మురుగునీరు

కళ్యాణదుర్గం/రాయదుర్గం/ఉరవకొండ: పల్లె, పట్టణం అన్న తేడాలేకుండా ప్రతి చోటా పారిశుధ్యం లోపించింది. ఇటీవల భారీ వర్షాలు కురుస్తుండడంతో వీధులన్నీ ఛిద్రమై, నడవడానికి కూడా వీలులేకుండా ఉంది. చిన్నపాటి వర్షానికి దారులన్నీ బురదమయమయ్యాయి. పారిశుధ్య లోపంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పారిశుధ్యం మెరుగునకు ఎలాంటి చర్యలూ చేపట్టలేదని ప్రజలు అంటున్నారు. కనీసం అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోలేదంటున్నారు.

- కళ్యాణదుర్గం నియోజకవర్గంలో చాలా గ్రామాల్లో పరిస్థితి అధ్వానంగా ఉంది. చినుకుపడితే చాలు.. వీధులన్నీ బురదమయంగా ఉంటున్నాయి. నియోజకవర్గ కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరంలోని మల్లిపల్లిలోనే వీధులు అధ్వానంగా ఉన్నాయి. బురదమయంగా మారి నడవడానికి కూడా వీలులేదు.

వర్షం వచ్చిందా.. నడవలేం

- రాయదుర్గంటౌన్ : వర్షం పడితే చాలు....పట్టణంలోని కొన్ని రహదారుల్లో ప్రయాణించే వీలులేకుండా పోతుంది. వాహనదారులు, పాదచారులు గుంతల్లో నిలిచిన వర్షపునీరు, పేరుకుపోయిన బురదనీటిలోనే అవస్థలు పడాల్సి వస్తోంది. కొన్ని రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తుండడంతో వీధుల్లో నీరు నిలిచి అడుగు తీసి అడుగుపెట్టడానికి ఇబ్బందిగా ఉంది. కొన్నిచోట్ల బురద పేరుకుపోయి ప్రజలు అవస్థలు పడుతున్నారు. రాయదుర్గం మధు టాకీస్ ఏరియాలో పరిస్థితి ఘోరంగా ఉంది. దుగ్గిలమ్మ ఆలయ రహదారి, గొగ్గిరొట్టి నుంచి వెళ్లే మరోదారిలో గుంతల్లో నీరు నిలిచింది. 4వ వార్డు మీసేవ కార్యాలయం ఎదుట బురదమయమైంది. 32వ వార్డు, 14వ వార్డు, 10వ వార్డుల్లోని మట్టి రహదారుల్లో వర్షపునీటితోపాటు డ్రైనేజీ నీరు చేరింది.

గుమ్మఘట్ట: భూపసముద్రం, నేత్రపల్లి, గలగల, కలుగోడు, గుమ్మఘట్ట, గోనబావి, తాళ్లకెర, మారెంపల్లి, ఆర్.కొత్తపల్లి,రంగచేడు తదితర గ్రామాలు మురికి కూపాలుగా మారాయి. ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. వీధులు అధ్వానంగా ఉన్నా పట్టించుకునేవారు లేరని ప్రజలు అంటున్నారు.

- ఉరవకొండ నియోజకవర్గంలోని చాలా పంచాయతీల్లో పారిశుధ్యం లోపించింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు బురదమయమై, నడవడానికి వీలులేదు. వాహనాలు వెళ్లాలన్నా ఇబ్బంది ఉంది. విడపనకల్లు మండలం గాజుల మల్లాపురం గ్రామం నుంచి దర్గాహోన్నూరు వెళ్లే దారి అధ్వానంగా ఉంది. అడుగుకో గుంత పడటంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు.

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని పిల్లలపల్లి, పడమటి కోడిపల్లి, నాగిరెడ్డిపల్లి, ముప్పలకుంట, సంతే కొండాపురం గ్రామాల్లో చాలా చోట్ల చినుకు పడితే చాలు.. దారులు, వీధులన్నీ చిత్తడిగా మారుతున్నాయి. చిన్న పాటి వర్షానికే దారులు మొత్తం బురదమయంగా మారుతున్నాయి. గ్రామస్తులు పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదంటున్నారు. దీంతో గ్రామాల్లో పారిశుధ్యంలోపించి, ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు.

మడుగులు కాదు.. వీధులే

బొమ్మనహాళ్: మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం లోపించింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు మరింత అధ్వానంగా ఉన్నాయి. ఉద్దేహాళ్-బండూరు వెళ్లే దారి అధ్వానంగా ఉంది. ఉద్దేహాళ్ నుంచి బండూరు, గోవిందవాడ, కల్లుదేవనహళ్లి, దర్గాహొన్నూరు, బొల్లనగుడ్డం, పాల్తూరు, ఉరవకొండ గ్రామాలకు ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఉద్దేహాళ్ నుంచి డి.హీరేహాళ్ తిమ్మలాపురం, నాగలాపురం ,మల్లికేతి గ్రామాలకు వెళ్లే దారి పరిస్థితి కూడా అంతే. చిన్న పాటి వర్షం కురిసినా వీధులన్నీ అధ్వానంగా ఉంటున్నాయి. బొమ్మనహాళ్ నుంచి కురువల్లి లోనూ మరీ దారుణంగా ఉంది. ఈ దారుల గుండా ఆటోలు, బస్సు, కార్లు, ద్విచక్ర వాహనాలపై ప్రయాణించాలన్నా ప్రజలు అవస్థలు పడుతున్నారు.



మల్లాపురం- దర్గా హొన్నూరు దారి ఇలా..



ఉద్దేహాళ్- తిమ్మలాపురంలో వర్షపునీటితో ఇలా..





బ్రహ్మసముద్రం మండలం ముప్పలకుంటలో ఇదీ పరిస్థితి... పిల్లలపల్లిలో రోడ్డుపైనే నిలిచిన మురుగు

చురుగ్గా హెలీప్యాడ్ ఏర్పాటు పనులు



హెలీప్యాడ్ పనులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు విశ్వేశ్వరరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి



హెలీప్యాడ్ పనులు చురుగ్గా జరుగుతున్న దృశ్యం

ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి తనయుడు వై.ప్రణయ్‌రెడ్డి, రోహిత వివాహం ఈ నెల 14న అనంతపురంలో జరగనుంది. ఈ వేడుకకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకానున్నారు. దీంతో అనంతపురంలోని రుద్రంపేట బైపాస్ వద్ద హెలీప్యాడ్ ఏర్పాటు పనులను ఉరవకొండ, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యేలు విశ్వేశ్వరరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి సోమవారం పరిశీలించారు. హెలీప్యాడ్ పనులు త్వరగా పూర్తి చేయాలని వారు సూచించారు. వారి వెంట పార్టీ నేతలు వెన్నపూస రవీంద్రారెడ్డి, నదీం, జిల్లా అధికార ప్రతినిధి వీరన్న, విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కూటమిది ప్రజావ్యతిరేక పాలన



కూటమి మేనిఫెస్టో పోస్టర్లు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

శెట్టూరు: కూటమి ప్రజావ్యతిరేక పాలన సాగిస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి అన్నారు. సోమవారం మండలంలోని యాటకల్లులో 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో, బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ ఈరన్న, ఎంపీపీ సోమనాథరెడ్డి, కన్వీనర్ ఎమ్మెస్ రాయుడు, ఎంపీటీసీ ఎర్రిస్వామి స్థానిక నాయకులతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి చంద్రబాబు అపద్ధపు హామీలు, మేనిఫెస్టో మోసాలపై వివరించారు. గత ఐదేళ్లలో జగనన్న ఏటా ప్రతి గడపకూ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించారన్నారు. కూటమి ప్రభుత్వం ఓట్ల కోసం సాధ్యంకాని హామీలు ఇచ్చి అధికారంలోకొచ్చి ప్రజలను వంచిస్తున్నారని అన్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా జగనన్న ప్రజలందరినీ సమానంగా చూశారన్నారు. ఇప్పటికైనా జగనన్నకు, చంద్రబాబుకు మధ్య వ్యత్యాసం గమనించాలని ప్రజలను కోరారు.

గ్రామకమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక : గ్రామంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా నీరుగంటి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా రామమూర్తి, ప్రధాన కార్యదర్శి రామదాసు, ఈశ్వరప్ప, కార్యదర్శులు హనుమంతురాయుడు, రామచంద్ర, రామంజి, సాయి, సిద్ధప్ప ఎంపిక చేశారు. యూత్ అధ్యక్షుడు లక్ష్మణమూర్తి, మాజీ సర్పంచ్ రామదాసు పాల్గొన్నారు.

ఆర్డీటీ సేవలను పునరుద్ధరించాలని నిరసన



కుందుర్పి తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న దృశ్యం



విడపనకల్లులో ర్యాలీ చేస్తున్న ఆర్డీటీ పరిరక్షణ కమిటీ సభ్యులు, మహిళలు



బొమ్మనహాళ్: తహసీల్దార్ మునివేలుకు వినతి పత్రం అందిస్తున్న ప్రజలు

కుందుర్పి: ఆర్డీటీ సేవలను పునరుద్ధరించాలని కుందుర్పి,కంబదూరు మండలాల ప్రజలు కుందుర్పి తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలియజేశారు. ఆర్డీటీ పరిరక్షణ జేఏసీ కన్వీనర్ గుర్రం లింగప్ప, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున,ఎంపీపీ కమలా నాగరాజు, సర్పంచులు విజయ్, గంగాధర, మాజీ సర్పంచ్ కరిగానిపల్లి తిప్పేస్వామి, ఫెర్రర్ ఆలయ కమిటీ చైర్మన్ ఓబయ్య,ఎస్సీ సెల్ తాలూకా అధ్యక్షుడు తిప్పేస్వామి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రాజ గోపాల్, శీగలపల్లి సునీల్, ఎంఆర్‌పీఎస్ నాయకులు ఎర్ర రామాంజి, సీబీటీలు సిద్దప్ప, రాజేష్ , కంబదూరు,కుందుర్పి మహిళలు పాల్గొన్నారు.

విడపనకల్లు: మండల కేంద్రంలో సోమవారం ఆర్డీటీ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. ఆర్డీటీ మహిళా సంఘాలు, సీడీసీ సభ్యులు, లబ్ధిదారులు ర్యాలీ చేశారు.అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి, నిరసన తెలియజేశారు.

ఆర్డీటీ సేవలు పునరుద్ధరించాలని ర్యాలీ

బొమ్మనహాళ్: కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేస్తూ కురువల్లి, చంద్రగిరి, గౌనూరు గ్రామాల ప్రజలు సోమవారం నిరసన తెలియజేశారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆర్డీటీ సీబీటీలు గోవిందు , ఎర్రిస్వామి, బసవరాజు, మహిళలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ జాతీయభావం పెంపొందించుకోవాలి



హర్ ఘర్ తిరంగా ర్యాలీలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప

రాయదుర్గంటౌన్: ప్రతి ఒక్కరిలో జాతీయ భావం పెంపొందించడమే హర్ ఘర్ తిరంగా ముఖ్య ఉద్దేశమని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కమిషనర్ దివాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా ఆగస్టు 15 వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం జరుగుతోందన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి వినాయక సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పొరాళ్ల గోవిందరాజులు, కోఆప్షన్ సభ్యుడు నజీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పొరాళ్ల శివకుమార్, దివాకర్, రామాంజనేయులు, బషీర్ అహ్మద్, నిజాముద్దీన్ పాల్గొన్నారు.

రాయదుర్గంటౌన్: పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ జరిగింది. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జింక వసుంధర ఆధ్వర్యంలో వినాయక సర్కిల్ వరకు ర్యాలీ చేశారు. బీజేపీ నేతలు సత్యనారాయణరెడ్డి, అంభోజీరావు, తిమ్మారెడ్డి, మల్లేశ్వర, అరుణ, ఆంజనేయులు, శివశంకర్, ప్రకాష్ పాల్గొన్నారు.

జాతీయ జెండా స్ఫూర్తిని నింపాలి

బొమ్మనహాళ్: దేశ సార్వభౌమత్వానికి, ఆత్మ గౌరవానికి ప్రతీక మన మువ్వన్నెల జాతీయ జెండా అని తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ విజయభాస్కర్ అన్నారు. సోమవారంమండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. స్థానిక జెడ్పీ పాఠశాల నుంచి పోలీస్ స్టేషన్ వరకు జాతీయ జెండాలతో విద్యార్థులు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ మల్లికార్జున, సీనియర్ అసిస్టెంట్ హనుమంతప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ (వజ్రకరూరు): వజ్రకరూరు మేజర్ పంచాయతీ పరిధిలో మేజర్ పంచాయతీ సర్పంచ్ మోనాలీసా ఆధ్వర్యంలో ముందస్తు స్వాతంత్ర్య వేడుకలు సోమవారం నిర్వహించారు. స్థానిక గాంధీచౌక్ సర్కిల్‌లో జాతీయ పతకాలతో ర్యాలీ చేశారు. అనంతరం సర్కిల్ మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం జాతీయ గీతాలకు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

రోడ్డు నిబంధనలు పాటించాలి

విడపనకల్లు: ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్ఐ ఖాజాహుస్సేన్ వాహన చోదకులకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై వివరించారు. పరిమితి మించి ప్రయాణికులను తరలించరాదని, అతివేగం ప్రమాదకరమని అన్నారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ పొంది ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి

కళ్యాణదుర్గం రూరల్: ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలని రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో నియోజవర్గంలోని ఆర్ఎస్‌కే సిబ్బందికి ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడి తగ్గుతుందన్నారు. రానున్న రోజుల్లో రసాయన ఎరువులు వాడటం వల్ల పంటలు పూర్తిగా దెబ్బతింటాయన్నారు. కార్యక్రమంలో ఏడీఏ ఎల్లప్ప, ఏఓ శ్రావణ్‌కుమార్, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

కూడేరులో జోరు వాన

కూడేరు: మండలంలో సోమవారం జోరుగా వర్షం కురిసింది. ఖరీఫ్ ప్రారంభమైనప్పటి నుంచి బలమైన వర్షం కురవలేదు. ఇన్ని రోజులు జల్లులు పడుతూ వచ్చాయి. సోమవారం గాలివానతో భారీ వర్షం కురిసింది.

ఆలయ అభివృద్ధికి రూ.1.10 లక్షల విరాళం

కుందుర్పి: మండలంలోని అప్పిలేపల్లికి చెందిన అంగడి రాఘవేంద్ర అనే భక్తుడు సోమవారం ఆలయాల అభివృద్ధికి రూ.1.10 లక్షలు విరాళం అందించినట్లు సర్పంచ్ అతావుల్లా తెలిపారు. స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో శఠగోపానికి రూ.55 వేలు, స్థానిక పీర్ల స్వామి చావిడికి రూ.55 వేలు అందించారు. రెండు నెలల క్రితమే రాఘవేంద్ర గ్రామంలో శుద్ధజల మంచినీటి పథకానికి రూ.12 లక్షలు, పాఠశాల అభివృద్ధికి రూ.3 లక్షలు విరాళంగా అందజేసిన విషయం తెలిసిందే. విరాళాలు అందిస్తున్న రాఘవేంద్రను గ్రామస్తులతో పాటు సర్పంచ్ తదితరులు అభినందించారు.

కూడేరు: తిమ్మాపురంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి అనంతపురానికి చెందిన గోపాల్ శెట్టి భార్య మాదాళపు మిత్రవింద సోమవారం రూ.10 వేలు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందించారు.

వైభవంగా ధ్వజ పట ఆరాధన

బొమ్మనహాళ్: మండలంలోని ప్రసిద్ధి చెందిన నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు సోమవారం ధ్వజ పట ఆరాధన నిర్వహించారు. అర్చకులు అనిల్‌కుమార్ చార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి.

సంగమేశ్వరాలయంలో కిక్కిరిసిన భక్తులు

కూడేరు: మండల కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన స్వయంభు జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. శ్రావణమాసం మూడో సోమవారం సందర్భంగా జిల్లా నల మూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అర్చకులు శివశంకర్ శాస్త్రి, మహేష్, శివ, మహేష్ స్వాములు జోడు లింగాలకు పాలాభిషేకం, రుద్రాభిషేకం చేశారు.

రాఘవేంద్రస్వామి మధ్యారాధన



రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన రాఘవేంద్రస్వామి ఆలయంలో ఆరాధనోత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. రెండో రోజు సోమవారం స్వామి మధ్యారాధన సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాఘవేంద్రస్వామి మూలవిరాట్‌ను అలంకరించి, పూజలు చేశారు. మంగళవారం స్వామి వారి ఉత్తర ఆరాధన సేవ ఉంటుందని రాఘవేంద్రస్వామి మఠం సభ్యులు తెలిపారు.

విడపనకల్లు: మండల పరిధిలోని ఉండబండ వీరభద్రస్వామి ఆలయంలో శ్రావణ సోమవారం సందర్భంగా వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు లయంలో ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు.

నేడు నులి పురుగుల నిర్మూలన దినోత్సవం

ఉరవకొండ: మండలంలో మంగళవారం జరగనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఈఓఆర్డీ సతీష్ కుమార్, ఎంఈఓ ఈశ్వరప్ప పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పోస్టర్లు విడుదల చేశారు. ఈఓఆర్డీ, ఎంఈఓలు మాట్లాడుతూ మండలంలోని 84 అంగన్‌వాడీలు, 67 ప్రాథమిక, 3 ప్రభుత్వ కళాశాలలు, 15 ప్రైవేట్ పాఠశాలల్లో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ శంకర్, కౌకుంట్ల సూపర్‌వైజర్ యుగంధర్, హెల్త్ సూపర్‌వైజర్ నిమ్మల వెంకటేష్, అర్చన, సుమలత, లక్ష్మి, అరుణ, శమంతకమణి, సులోచన షాజీదా పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు మంగళవారం పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ, పీహెచ్‌సీ వైద్యులు రమేష్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వైద్య ఆరోగ్యసిబ్బందికి మాత్రలను పంపిణీ చేశారు. 67 అంగన్‌వాడీ కేంద్రాలు, 56 ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలో 0 నుంచి 19 ఏళ్లలోపు వారందరికీ గుళికలు వేయనున్నారు. కార్యక్రమంలో వైద్యులు సందేశ్‌కుమార్, ఏపీఓ సురేశ్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సార్..పంటకాలం వరకు సమయమివ్వండి

కళ్యాణదుర్గం: సార్.. ఖరీఫ్ సీజన్‌లో పెట్టుబడి పెట్టి, పంటలు సాగు చేశాం.. పంట కాలం పూర్తయ్యే వరకు సమయమివ్వండి.. కాంట్రాక్టర్లు బీటీపీ కాలువ పనులు చేసేందుకు వచ్చారు.. అని బోరంపల్లికి చెందిన బీటీపీ కాలువ భూ బాధితులు ఆర్డీఓ వసంతబాబును కోరారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో రైతులు వినతిపత్రం అందించారు. ముదిగల్లు రెవెన్యూ పరిధిలోని బోరంపల్లిలో సర్వే నంబర్.. 42,43,44, 45,81,105,106తో పాటు పలు సర్వే నంబర్లలో బీటీపీ కాలువకు ప్రభుత్వం భూమిని సేకరించింది. ఏళ్లతరబడి కాలువ తవ్వకం పనులు చేపట్టకపోవడంతో ఏటా మాదిరిగానే ఈ సారి కూడా సదరు రైతులు కంది, ఆముదం, టమాట, అరటి తదితర పంటలను రూ.లక్షలు పెట్టుబడి పెట్టి సాగు చేసినట్లు తెలిపారు. 106 సర్వే నంబర్‌లోని భూమి యజమానికి పరిహారం ఇవ్వలేదని ఆర్డీఓ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో రైతులు హనిమిరెడ్డి, గోపాల్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రాము, ఫకృద్దీన్, ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బీహెచ్ రాయుడు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్ ప్రసాద్ పాల్గొన్నారు.

మారని అధికారుల తీరు..

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పలుశాఖల అధికారులు డుమ్మాకొట్టారు. అర్జీలు ఇచ్చేందుకు వచ్చిన ప్రజలు సంబంధిత శాఖల అధికారులు లేక వెనుదిరిగారు. తహసీల్దార్ సుమతి, ఎంపీడీఓ రంగనాయకులు, ఎంఈఓ ఓబుళపతి, హౌసింగ్ ఏఈ రామ్మోహన్, ఉపాధి ఏపీఓ విజయరాజు , ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఖాసింబీ హాజరయ్యారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



బొమ్మలింగ మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి

కుందుర్పి: ఎనుములదొడ్డికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పూల బొమ్మలింగ (48) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి ఎనుములదొడ్డికి వెళ్లి బొమ్మలింగ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అంత్యక్రియలకు రూ.5వేలు అందజేశారు. వాల్మీకి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పాలాక్షి, సర్పంచ్ విజయ్, మండల కన్వీనర్ హనుమంతరాయుడు, కళ్యాణదుర్గం మండల కన్వీనర్ సూరి, స్థానిక నాయకులు బొమ్మలింగ, తిప్పేస్వామి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉరవకొండ రూరల్: ఉమ్మడి జిల్లాల్లో ప్రసిద్ధి చెందిన పెన్నహోబిలం లక్ష్మీ నృసింహస్వామి ఆలయ పాలక మండలి సభ్యుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈవో రమేష్ బాబు సోమవారం తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తులను స్వయంగా కానీ రిజిష్టర్ పోస్ట్ ద్వారా కానీ 20 రోజుల్లోపు పెన్నహోబిలం ఆలయ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

అనురాగాలకు ప్రతీక రాఖీ పండుగ

కూడేరు: సోదర సోదరీమణుల ప్రేమానురాగాలు, అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ అని ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీ విశ్వవిద్యాలయం మండల సంచాలకురాలు వేదావతి తెలిపారు. సోమవారం స్థానిక ఎస్‌బీఐలో మేనేజర్ ఈశ్వరయ్య, పోలీసు స్టేషన్‌లో సీఐ రాజు, సిబ్బందికి, తహసీల్దార్ కార్యాలయం, ఇతర కార్యాలయాల్లో అధికారులకు రాఖీలు కట్టి, స్వీట్లు పంపిణీ చేశారు.